



కురవి మండలం అచ్చిరాంతండాలో గాలిదుమారానికి కొట్టుకుపోయిన ఇంటి పైకప్పు



బిచ్చానాయక్‌తండాలో నేలపాలైన వడ్లను చూసి రోదిస్తున్న మహిళ



ఇందిరానగర్ శివారులో నష్టపోయిన వరిపొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి తిరుపతిరెడ్డి



నెల్లికుదురు మండలం హనుమాన్‌నగర్‌తండాలో నేలవాలిన మొక్కజొన్న

- నేలవాలిన వరి, మొక్కజొన్న పంటలు
- రాలిన మామిడి, బొప్పాయి
- కొట్టుకుపోయిన మిర్చి, ఎగిరి పోయిన ఇళ్ల పైకప్పులు
- నష్టం అంచనా వేస్తున్న వ్యవసాయ, ఉద్యాన, విద్యుత్ శాఖలు

చెడగొట్టు వాన

జిల్లాలో గాలి, వడగళ్ల వర్ష బీభత్సం

మహబూబాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రైతు కష్టం వడగండ్ల వాన పాలైంది.. ఆరుగాలం శ్రమించినా అన్నదాతకు కన్నీరే మిగిలింది.. మరో నాలుగైదు రోజుల్లో పంట చేతికి వస్తుందని ఆశపడుతుండగా.. అకాల గాలి, వర్షం బీభత్సం సృష్టించింది. కర్షకుల వెన్నువిరిచి, తీరని నష్టాన్ని మిగిల్చింది. బలమైన గాలులు వీయడంతో వరి, మొక్కజొన్న, మిర్చి, మామిడితోటలకు భారీ నష్టం వాటిల్లింది.

మహబూబాబాద్ జిల్లాలో సోమవారం రాత్రి 8 గంటల నుంచి అర్ధరాత్రి దాటే వరకు పొలాలపై వడగండ్లు కురియడంతో వరి వెన్నులు (కంకులు) వడ్లు రాలిపోయాయి. అనేక తోటల్లో మామిడి కాయలు రాలిపోయాయి. మొక్కజొన్న చేలు విరిగి, నేలకు ఒరిగాయి. కంకులు



నారాయణపురం క్యాంపుతండాలో తోటలో రాలిన మిర్చి

సైతం విరిగిపోయాయి. ఎండబెట్టుకున్న మిర్చి కుప్పలు బలమైన గాలులకు ఎగిరిపోయాయి. అనేక ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి. విద్యుత్ స్తంభాలు ఒరిగి లైన్లు తెగిపోయాయి. పలు గ్రామాలు అంధకారంలో కొట్టుమిట్టాడాయి. కొన్ని ఊళ్లల్లో రాత్రికి రాత్రే కరెంట్‌ను పునరుద్ధరించగా.. 13 గ్రామాల్లో మంగళవారం రాత్రి వరకు మరమ్మతులు కొనసాగాయి. మహబూబాబాద్ నుంచి వయా పెనుగొండ మీదుగా కేసముద్రం, మహబూబాబాద్ నుంచి వయా తాళ్లపూసపల్లి, కల్వల మీదుగా, నెల్లికుదురు, ఆలేరు, మహబూబాబాద్‌ల మధ్య అనేక చెట్లు కూలిపోగా, పోలీసులు ప్రజల సహకారంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

2,686 ఎకరాల్లో వరి పంట నష్టం

మహబూబాబాద్ అగ్రికల్చర్, (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కేసముద్రం, మహబూబాబాద్, నెల్లికుదురు మండలాల్లో వడగండ్ల వానకు భారీ నష్టం జరిగింది. మిగతా మండలాల్లో కొద్దిగా నష్టం జరిగింది. వరి 2,686ఎకరాల్లో నష్టం కాగా, 130ఎకరాల్లో మొక్కజొన్న దెబ్బతిన్నట్లు జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మల తెలిపారు. జిల్లాలో 128మంది రైతులకు చెందిన 438ఎకరాల్లో ఉన్న మామిడి తోటలు, ఇద్దరి రైతులకు చెందిన 5ఎకరాల్లో బొప్పాయికి నష్టం వాటిల్లిందని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మరియన్న తెలిపారు. కేసముద్రం, ఇనుగుర్తి, మహబూబాబాద్ రూరల్ పరిధిలోని మండలాల్లోనూ, ఇతర మండలాల్లోనూ 167 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయని విద్యుత్‌శాఖ జిల్లా అధికారి నరేష్ తెలిపారు. సుమారు రూ.8.35 లక్షలు నష్టం వాటిల్లినట్లు చెప్పారు.

86.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు..

జిల్లాలో సోమవారం రాత్రి 86.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్‌లో 22.2, గంగారంలో 5.2, కురవిలో 8.8, కేసముద్రంలో 0.6, చిన్నగూడూరులో 1.0, మరిపెడలో 9.6, తొర్రూరులో 6.4, పెద్ద వంగరలో 7.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

జిల్లాలో ఇలా..

మానుకోట పట్టణంలో జర్నలిస్టుతో పాటు అనేక కాలనీల్లో ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలవాలాయి. కొమ్ముగూడెంలో బానోత్ లాలు, సుందర్, మోతీలాల్‌కు చెందిన ఇళ్ల పైకప్పులు లేచిపోవడంతో ఇంట్లో సామగ్రి మొత్తం వర్షానికి తడిసిపోయింది. బాదావత్ మంగీలాల్ అనే రైతు రూ.5లక్షల పెట్టుబడితో మిర్చి తోటను సాగుచేశారు. వచ్చిన దిగుబడిని ఎండకు ఆరబెట్టుకోగా.. రాత్రి బలమైన గాలులకు టార్పాలిన్‌తో సహా 5క్వింటాళ్ల మిర్చి గాలికి ఎగిరిపోయాయి. దాంతో మిర్చి రైతు లబోదిబోమంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. బ్రహ్మణపల్లి లక్ష్మీపురం భూక్య బావ్‌సింగ్ మూడు ఎకరాలను కౌలుకు తీసుకుని వరి సాగు చేయగా, పూర్తిగా వడ్లు రాలిపోయాయి. విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. వ్యవసాయ మార్కెట్ యార్డులో అమ్మకానికి వచ్చిన మిర్చి బస్తాలు తడిసిపోయాయి. కేసముద్రం మండలంలో కొత్తూరు, బిచ్చానాయక్‌తండా, పెద్దమొరితండా, పిక్యతండా, నారాయణపురం, వన్నాలకుంట, ధన్నసరి, బేరువాడ, అమీనాపురం శివారు తండాలు, గ్రామాల్లో వరి పొలాలు నేలవాలాయి. వడగండ్ల వానతో కోతకు వచ్చిన వరి పూర్తిగా పాడైపోయింది. మూడు అంగుళాల మేర మందం ఉన్న వడగండ్లు పడ్డాయి. పలు గ్రామాల్లో ఇండ్ల పైకప్పులూ లేచిపోయి ప్రజలు

మిగతా 8వ పేజీలో...



మోదుగులగూడెంలో నేలరాలిన బొప్పాయి



ఇనుగుర్తిలోని మామిడితోటలో నేలరాలిన కాయలు



గార్లలో విద్యుత్ స్తంభాలను పునరుద్ధరిస్తున్న అధికారులు, సిబ్బంది

మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు జరపాలి

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో మిర్చికి కొనుగోళ్లు ఆలస్యం జరుగుతున్నాయని, వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు గునిగంటి రాజన్న, జిల్లాఉపాధ్యక్షుడు నల్లపు సుధాకర్ కోరారు. వెంటనే మిర్చిని కొనుగోలు చేయాలని మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. దాంతో మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, కార్యదర్శి శంషీర్ వచ్చి వెంటనే వేలంపాటలునిర్వహిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

17న రాష్ట్ర వ్యాప్తంగా టోకెన్ సమ్మె



డీపీవోకు వినతిపత్రం అందజేస్తున్న కొత్తపల్లి రవి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : జీపీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 17న రాష్ట్ర వ్యాప్తంగా టోకెన్ సమ్మెను నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. ఈ మేరకు మంగళవారం మహబూబాబాద్ డీపీవో హరిప్రసాద్‌కు సదరు డిమాండ్‌తో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లోన్న సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వ దృష్టిపెట్టడంలేదన్నారు. విధి నిర్వహణలో మరణించిన కార్మికుని కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలన్నారు. జీవో నెంబర్ 51ని సవరించి పాత పద్దతిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. బిల్లకంటి సూర్యం, బీకు, పైండ్ల యాకయ్య, కందాల రంగయ్య పాల్గొన్నారు.

పీఈటీ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



మానుకోట జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ అసోసియేషన్ నూతన కమిటీ బాధ్యులను సన్మానిస్తున్న దృశ్యం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ అసోసియేషన్ (పీఈటీ) నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర బాధ్యులు రాఘవరెడ్డి, కృష్ణమూర్తిగౌడ్ తెలిపారు. మానుకోట జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా కొప్పుల శంకర్, ప్రధాన కార్యదర్శిగా చెడుపల్లి ఐలయ్య, కోశాధికారిగా సునిల్‌ను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. వీరు రెండేళ్ల పదవిలో కొనసాగుతారని వారు వివరించారు.

అవమానభారంతో..

మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్య

- అప్పులు కూడా మరో కారణం
- కురవి మండలం కాకులబోడుతండాలో ఘటన



కిషన్‌నాయక్ (ఫైల్)



కిషన్‌నాయక్ మృతదేహం వద్ద కన్నీటిపర్యంతమైన మాజీమంత్రి సత్యవతిరాథోడ్

కురవి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : అప్పుల ఊబిలో కూరుకుపోయిన మాజీ సర్పంచ్ కౌసల్య భర్త గుగులోతు కిషన్‌నాయక్ (60) అవమానభారంతో మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సతీష్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

మండలంలోని కాకులబోడుతండాలో గత స్థానిక సంస్థల ఎన్నికల్లో కిషన్‌నాయక్ తన భార్య కౌసల్యను సర్పంచ్‌గా పోటీలో నిలబెట్టి విజయం సాధించారు. ఈ క్రమంలో కిషన్‌నాయక్‌కు అప్పులు అధికమయ్యాయి. దీంతో అదే తండాలో నివసించే స్వయాన తనబావ హర్యకు 30గుంటల భూమిని అమ్మి, హద్దులు పెట్టాడు. తన కుమార్తె పెళ్లి కోసం ఉన్న ఆరు ఎకరాల్లో 3 ఎకరాల భూమిని అమ్మేందుకు నిర్ణయించుకున్నాడు. అయితే హర్య.. ఆయన కుమారుడు సుమన్ తమ భూమిని అమ్మిన తర్వాతే నీ భూమిని అమ్ముకో వాలంటూ.. తరుచూ ఘర్షణ పడేవారు. ఈనెల 6వ తేదీన తండాలో పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీని సైతం నిర్వహించారు. ఈ పంచాయతీలో సుమన్ తన మామ కిషన్‌ను దుర్భాషలాడి చెప్పుతో కొట్టాడు. అనంతరం కిషన్ ఇంటికి వెళ్లి ఇంటిముందు ముళ్లకంచె వేశాడు. దీంతో అవమానంగా భావించిన కిషన్‌నాయక్ రెండ్రోజులుగా ఇంట్లో నుంచి బయటకి రాలేదు. మంగళవారం భార్య కౌసల్య మిర్చి ఏరేందుకు కూలీకి వెళ్లగా, ఇంట్లో ఒంటరిగా ఉన్న కిషన్‌నాయక్ ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య కౌసల్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సతీష్ వెల్లడించారు. కాగా, మృతుని కుటుంబాన్ని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్, మాజీమంత్రి సత్యవతిరాథోడ్ పరామర్శించారు. అప్పులపాలైన సర్పంచ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పరంగా రావాల్సిన బిల్లులను ఇప్పించాలని కోరారు.

నేటి నుంచి సమ్మేటీవ్-2 పరీక్షలు

- ఈ నెల 17వరకు నిర్వహణ
- పరీక్షలు రాయనున్న 1 నుంచి 9వ తరగతి విద్యార్థులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో బుధవారం (నేటి) నుంచి 1వ తరగతి నుంచి 9 వరకు విద్యార్థులకు సమ్మేటీవ్-2 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈనెల9 నుంచి 17వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి 11.30 వరకు 1వ తరగతి నుంచి 5వ తరగతి, 6, 7 తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. 8వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 గం టల నుంచి 11.45 గంటల వరకు, 9వ తరగతి విద్యార్థులకు 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించేందుకు పరీక్ష పత్రాలను అన్ని పాఠశాలలకు చేర్చారు.

అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలి

ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

బయ్యారం, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియనాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన మాలపాడు గ్రామాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు తొలుత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు ఇచ్చి, వెంటనే వాటిని వెనక్కు తీసుకున్న విషయాన్ని హరిప్రియ దృష్టికి తీసుకొచ్చారు. తమకు నిలువ నీడలేదని, ఇందిరమ్మ ఇళ్లు వస్తుందని ఎంతో ఆశగా ఎదురుచూసిన తమకు నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే పలువురు మాజీ ఎమ్మెల్యేకు మంజూరు ఇళ్ల పత్రాలు చూపించగా.. వాటిని లబ్ధిదారులతో కలిసి హరిప్రియ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 26న గణతంత్ర దినోత్సవం రోజు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన ఐదు పథకాలు అట్టర్‌ప్లాప్ అయ్యాయని విమర్శించారు. 114 మంది అర్హులను ఇందిరమ్మ ఇళ్లకు తొలుత ఎంపిక చేసి, మంజూరు పత్రాలు ఇచ్చిన ప్రభుత్వం వెనువెంటనె కుంటిసాకులు చూపిస్తూ.. పత్రాలు వెనక్కు తీసుకోవడం ప్రభుత్వం చేతకాని తనానికి నిదర్శనమన్నారు. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరగా చేసుకున్న ప్రభుత్వం వారిజీవితాలతో చెలగాటమాడుతుందని ఆరోపించారు. తొలుత ఎంపిక చేసిన 114 మంది ఇళ్ల లబ్ధిదారులతో పాటు నామాలపాడులో అర్హులైన ప్రతీ లబ్ధిదారిడికి సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ లబ్ధిదారుడికి బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని, వారికి న్యాయం జరిగేంత వరకు పోరుడాతమని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాతా గణేష్‌తో పాటు నాయకుల సత్యనారాయణ, శ్రీను, ఐలయ్య, లక్ష్మణ్, వెంకన్న, వీరన్న, భద్రన్న, సుగుణ, మమత, సంపత్, గణేష్, ఉదయ్, శరత్, యాకయ్య పాల్గొన్నారు.



నామాలపాడు గ్రామస్థులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు చూపిస్తున్న బానోత్ హరిప్రియనాయక్

'12 లోపు దరఖాస్తు చేసుకోవాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఐటీఐ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివిధ ట్రేడ్‌ల్లో ఏఐటీటీ జూలై 2025లో ప్రైవేటు అభ్యర్థిగా ఐటీఐలో ప్రవేశాలు పొందేందుకు ఈ నెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలని మానుకోట ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఇన్చార్జీ ప్రిన్సిపాల్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ ఆమోదిత, ప్రైవేటు కళాశాలల్లో విధులు నిర్వహిస్తూ అర్హత కలిగిన ఉద్యోగులు సంబంధిత ట్రేడ్‌లలో అభ్యర్థులు 3 సంవత్సరములపైబడి సర్వీస్ ఉండాలన్నారు. నైపుణ్యత కలిగినట్లుగా సంబంధిత సంస్థ ద్వారా సర్టిఫికెట్ ఉంటే అభ్యర్థులు ఎంప్లాయి గుర్తింపు కార్డు సమర్పించి, ములుగు రోడ్, వరంగల్ ప్రాంతీయ ఉప సంచాలకుడు ప్రాంతీయ కార్యాలయం, పారిశ్రామిక శిక్షణ నందు రూ.100 రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐటీఐలో సీవోఈ పాస్ అయిన అభ్యర్థులు ఎస్‌సీవీటీ అభ్యర్థులు 2018 వరకు ప్రవేశం పొందినవారు, ఇతర అభ్యర్థులు ఎస్‌సీవీటీలో 2019 నుంచి ప్రవేశం పొందిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు వరంగల్ ములుగు రోడ్డులోని ప్రాంతీయ ఉపసంచాలకుల కార్యాలయం, ఉపాధి పారిశ్రామిక శిక్షణశాఖ నందు సంప్రదించాలన్నారు.

మహనీయుల జీవిత చరిత్రలు స్ఫూర్తిదాయకం

జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి నరసింహస్వామి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మహనీయుల జీవిత చరిత్రలు అందరికి స్ఫూర్తి దాయకమని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి నరసింహస్వామి అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశాల మేరకు సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ సహకారంతో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కొందరికి సంబంధించిన వ్యక్తి కాదని అందరివాడని పేర్కొన్నారు. మహనీయులు ఏ ఒక్కరి కోసమో ఆలోచించి పనిచేయరని, యావత్ దేశ ప్రజల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పనిచేస్తారన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ మేటి మానవతామూర్తిగా, విజ్ఞాతజ్యోతిగా, భాషకందని త్యాగశీలిగా, మహాముఖ ప్రజ్ఞాశాలిగా, భారతరత్నగా పేరుగాంచారని తెలిపారు. నేటి సమాజానికి అంబేద్కర్ జీవితం ఆదర్శనియమన్నారు. సమావేశంలో డాక్టర్ పరికిపండ్ల అశోక్, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, వెనిగంటి శుభ, సహజ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహస్వామి

చిన్నకాళేశ్వరం డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్
భూసేకరణపై గ్రామసభ



గ్రామసభలో అధికారులకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చిన్నకాళేశ్వరం డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు సంబంధించి భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని బ్రాహ్మణపల్లిలో మంగళవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు గ్రామసభ నిర్వహించారు. కెనాల్ నిర్మాణం కోసం గత నెల 21న ప్రాథమిక నోటిఫికేషన్ విడుదలైంది. ఈనేపథ్యంలో శివారుల వారీగా గ్రామసభలు నిర్వహిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక నోటిఫికేషన్‌లోని అంశాలను రైతులకు వివరించారు. బ్రాహ్మణపల్లి శివారులో వరితో పాటు వాణిజ్య పంటలైన మిర్చి, పత్తి పంటలు పండే భూములున్నాయని, వాటిని పరిగణనలోకి తీసుకుని కెనాల్ కేవలం వరి పొలాల వరకు మాత్రమే నిర్మించాలని రైతులు కోరారు. మెట్ట భూముల్లో కాల్వల నిర్మాణం చేపడితే తాము నష్టపోవాల్సి వస్తుందని అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ప్రాథమిక నోటిఫికేషన్ ప్రకారం కాల్వ తమ గ్రామం చుట్టూ వస్తుందని, దీని వల్ల వర్షాకాలంలో వరదలు ఎక్కువైతే తాము ఎటు వెళ్లలేని పరిస్థితులు ఉంటాయని అధికారులకు వివరించారు. మెట్టభూముల్లో కాల్వ నిర్మాణం చేయొద్దని, గ్రామం చుట్టూ కాకుండా ఒకేవైపు కెనాల్ వచ్చేలా అలైన్‌మెంట్ మార్చాలని కోరారు. ఈ మేరకు గ్రామస్థులు, రైతులు అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, సబ్‌కలెక్టర్ కార్యాలయ నాయబ్ తహసీల్దార్ షఫీ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ గంగాధర్, ఏఈఈలు భరత్, ఆనంద్, సీనియర్ అసిస్టెంట్ సౌభాగ్యవతి, పంచాయతీ కార్యదర్శి సమ్మయ్య పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసే వారికే గుర్తింపు

▸▸ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి



హెచ్‌ఎం ఉమారాణి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

కాటారం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : విధుల పట్ల అంకితభావంతో పనిచేసే వారికే విశేష గుర్తింపు లభిస్తుందని టీచర్స్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. కాటారం జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం జన్నపురెడ్డి ఉమారాణి ఉద్యోగ విరమణ పొందగా అభినందన సభ మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ హాజరయ్యారు. ఉమారాణి-జితేందర్‌రెడ్డి దంపతులను ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉమారాణి పీఆర్‌టీయూలో కమిట్‌మెంట్ కలిగిన కార్యకర్తగా పనిచేశారని కొనియాడారు. ఈ తరం ఉపాధ్యాయులకు విధుల్లో ఉమారాణి అంకితభావం, క్రమశిక్షణ ఆదర్శంగా నిలుస్తాయన్నారు. శాసన మండలిలో ఉపాధ్యాయుల గొంతుకగా పనిచేస్తానని స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లుల పరిష్కారం, డీఏ బకాయిల విడుదల, హెల్త్ కార్డులను ప్రభుత్వం అందించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, మండల బాధ్యులు రవీందర్, తిరుపతి, సురేష్, ఉపాధ్యాయ సంఘాల నేతలు కరుణాకర్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వరి కోతలు షురూ..

- తగ్గిన కొనుగోలు కేంద్రాలు
- దళారులను ఆశ్రయిస్తున్న రైతులు

తొర్రూరురూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. ఆరంభంలో ఎంతో సుముఖంగా సాగు ప్రారంభించినా రబీ కాలం చివరి కోత దశలో కష్టాలు తప్పడం లేదని రైతులు, వ్యవసాయ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీజన్ ఆరంభంలో సాగు నీరు సమృద్ధిగా ఉండటంతో చెరువులు, బోర్లు, బావుల కింద సుమారు 18వేల ఎకరాల్లో సాగు చేసిన పంటలు కోతకు రావడంతో వరి కోతలు ప్రారంభించారు. 18వేల ఎకరాల్లో వరి సాగు చేయగా పొట్ట దశ, పాలుపోసే దశలో నీరు సరిపడా అందక రైతులు దిగుబడి తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా మార్చి వరకు మంచు రావడంతో వరికి రోగాలు విస్తరించాయి. దీంతో పెట్టిన పెట్టుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మండలంలో వరి కోతలు, మిర్చి పంటలు ఏరివేత ఒకేసారి కావడంతో కూలీల కొరతతో కూలీల రేట్లు అధికంగా పెరిగాయి. మిర్చి ఏరబోతే రూ.250 నుంచి రూ.300 ఉండగా కూలీల కొరత ఏర్పడడంతో రైతులు వరికోత యంత్రాలను ఆశ్రయిస్తే ధరలు భారీగానే ఉంటున్నాయని వెల్లడిస్తున్నారు. వరికోత యంత్రం గంటకు రూ.2,200 అడుగుతున్నారు. ఎకరం వరి పొలం కోస్తే సుమారు రూ.3వేల వరకు ఖర్చు వస్తుంది. దీంతో ఎకరం పొలం సాగు చేసినప్పటి నుంచి కోత కోసే వరకు రూ.30వేల వరకు ఖర్చు వస్తుంది. ఈ దిగుబడి తగ్గడంతో రైతులకు ఏమి మిగలడం లేదని, పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని దిగాలు చెందుతున్నారు. ఇప్పటికే మండలంలోని అమ్మాపురం, సోమారం, ఫత్తేపురం, పోలేపల్లి, వెల్లికట్టె తదితర గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి.

తగ్గిన కొనుగోలు కేంద్రాలు

రైతు కష్టపడి పండించిన పంటలను విక్రయించుకోవడానికి కోతలు ప్రారంభానికి ముందే గతంలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో తొర్రూరులో 17, పెద్ద వంగరలో 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం కేవలం పీఏసీఎస్ ఆధ్వర్యంలో 10 కేంద్రాలు, ఐకేపీ సెంటర్ నుంచి మడిపల్లి గ్రామంలో 1 కేంద్రం ఏర్పాటుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. మండలంలో విస్తారంగా కోతలు ప్రారంభమైనా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. వర్షాలు వచ్చే అవకాశం ఉండటంతో రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు వరి ధాన్యం విక్రయించుకొని ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరను కోల్పోతున్నారు. దూర ప్రాంతాల్లో ఏర్పాటు చేయడంతో రైతులకు దూరభారంతో, రూ.500 బోనస్ కోల్పోయి నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గతంలో మాదిరిగా ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



మండలంలోని ఫత్తేపురంలో వరిపంటను కోస్తున్న యంత్రం

ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేయాలి

కొత్తపల్లి రవి, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహ కార్యదర్శి



ప్రభుత్వం గతంలో మాదిరిగా ప్రతీ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. కొనుగోలు కేంద్రాలు తగ్గించడం ద్వారా రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను దళారులకు విక్రయించుకోవాల్సిన పరిస్థితి. ప్రభుత్వం స్పందించి తక్షణమే ప్రతీ గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి.

నిర్వహణ భారంతో తగ్గించాం..

వెలుగు మురళి, పీఏసీఎస్ సీఈవో, తొర్రూరు

రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరిపడా ధాన్యం కాంటాలు కావడం లేదు. కనీసం ప్రతీకేంద్రంలో రెండు లోడుల ధాన్యం కూడా రాకపోవడంతో నిర్వహణ భారంగా మారుతోంది. దీంతో కొన్నిచోట్ల తగ్గించాం. అధికారుల ఆదేశాల మేరకు ఏర్పాటు చేస్తాం.

ఆర్‌ఎంపీపై కేసు నమోదు

తాడ్వాయి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : లైసెన్సు లేకుండా మందులు విక్రయిస్తున్న ఆర్‌ఎంపీపై ఔషధ నియంత్రణ అధికారి కేసు నమోదు చేసిన సంఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఔషధ నియంత్రణ అధికారి పావని దాడులు నిర్వహించి క్లినిక్‌లో లైసెన్సు లేకుండా నిల్వ ఉంచిన మందులను స్వాధీనం చేసుకున్నారు. 26 రకాల మందులు, తొమ్మిది రకాల ఫిజీషియన్ శాంపిల్స్ లభించాయని ఆమె తెలిపారు. వాటిని సీజ్ చేసి ఆర్‌ఎంపీపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

26న మెగా జాబ్‌మేళా

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లిలో ఈనెల 26న మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాబ్‌మేళాకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి విశేషంగా కృషి చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే ఇప్పటికే 58వేల ఉద్యోగాలు భర్తీ చేయడమే కాకుండా రాజీవ్ యువ వికాసంతో 5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించనుందని అన్నారు. అలాగే పదో తరగతి నుంచి బీటెక్, పీజీ, వరకు చదివిన వారికి అర్హతలనుబట్టి ఉద్యోగనియామకాలకు 700 కంపెనీలతో మాట్లాడి మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

చింతచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడి మృతి



వెంకన్న (ఫైల్)

కేసముద్రం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇంటికన్నెలో మంగళవారం ప్రమాదవశాత్తు చింతచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడు బండారు వెంకన్న(56) మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన ప్రకారం... చింతచెట్టుపై భాగంలోంచి ప్రమాదవశాత్తు వెంకన్న జారి కిందపడడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. 108లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది. మృతునికి భార్య భాగ్యమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్టు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : గంజాయి క్రయ విక్రయాలు చేస్తున్న యువకులను హనుమకొండ పోలీసులు మంగళవారం అరెస్టు చేసినట్లు ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లాకు చెందిన మోతే మణికంఠ, కోటగిరి రోహిత్‌లు సులభంగా డబ్బులు సంపాదించేందుకు ద్విచక్ర వాహనంపై ఒడిషాలో కల్మిల గ్రామానికి వెళ్లి నాగరాజు అనే వ్యక్తి వద్ద అరకిలో గంజాయి కొనుగోలు చేశారు. తమ దగ్గర ఉన్న గంజాయిని విక్రయించేందుకు ఇద్దరు నిందితుల్లో మణికంఠ అనే వ్యక్తి సోమవారం హనుమకొండకు రాగా, పోలీసులు పక్కా సమాచారంతో సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా తన దగ్గర గంజాయి కొనుగోలు చేసిన బాలుడితో పాటు మేకల అవినాశ్, శనిగరపు అభిలాష్, కాంతాల రాజిరెడ్డి, ఓదెల అరుణ్‌లతో పాటు వ్యాపార భాగస్వామి రోహిత్ పేర్లు వెల్లడించగా వారిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేశామన్నారు. ఈ ఘటనలో ఒడిషాకు చెందిన నాగరాజుతో పాటు మణికంఠ దగ్గర గంజాయి కొనుగోలు చేసిన వడ్డెపల్లికి చెందిన తాళ్లపల్లి చిన్ను ప్రస్తుతం పరారీలో ఉన్నారన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



అఖిల (ఫైల్)

చిన్నగూడూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల కేంద్రంలోని రామచంద్రుతండాలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం... బాదవత్ అఖిల(25) ఇంట్లోని రేకుల పాకలో వంట చేస్తుండగా విద్యుత్ వైరు షార్ట్ సర్క్యూట్ అయి రేకుల ద్వారా కరెంట్ సరఫరా కావడంతో షాక్‌కు గురైంది. కుటుంబ సభ్యులు ఏరియా ఆస్పత్రి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ఆమెకు ఇద్దరు పిల్లలు, భర్త ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకుడు రావుల రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వీరన్న బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

కర్రెగుట్టలపైకి రాకండి

▸▸ కగార్ నుంచి రక్షణ కోసం బాంబులు అమర్చాం..

▸▸ తొలిసారి ప్రకటించిన మావోయిస్టులు

▸▸ వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరుతో లేఖ విడుదల



ములుగు/వాజేడు/వెంకటాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో మావోయిస్టులకు సేఫ్ జోన్‌గా భావిస్తున్న కర్రెగుట్టలపైకి సాధారణ పౌరులెవరూ రావొద్దంటూ మావోయిస్టులు హెచ్చరించారు. కగార్ పేరిట జరుగుతున్న దాడుల నుంచి రక్షణ కోసం గుట్టచుట్టూ బాంబులు అమర్చామని పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరిట ఓలేఖ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ములుగు జిల్లా పరిధిలోని వాజేడు, వెంకటాపురం మండలాలను కలుపుకుంటూ కర్రెగుట్టలు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోకి విస్తరించి ఉన్నాయి. దట్టమైన అడవులు ఉన్న ఈ ప్రాంతాన్ని మావోయిస్టు గెరిల్లా బేస్‌గా మార్చుకున్నారని, భద్రతా బలగాలు లక్ష్యంగా మందుపాతరలు అమర్చారని గతంలో పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. అటు భద్రాద్రి కొత్తగూడెం, ఇటు ములుగు జిల్లాను కలిపే ఈ గుట్టలు పోలీసులు, మావోయిస్టుల చర్యలు, ప్రతి చర్యలతో నిత్యం అలజడిగా మారుతుంటాయి.

పోలీసుల మాటలు నమ్మొద్దు

ఆపరేషన్ కగార్ పేరుతో పోలీసులు ఎన్‌కౌంటర్ల పేరుతో చేస్తున్న దాడుల్లో అనేకమంది పార్టీ నాయకులు, పీఎల్‌జీఏ సభ్యులతో పాటు సాధారణ ప్రజలు బూటకపు అమరులు అవుతున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. కగార్ దాడుల నుంచి రక్షణ పొందడానికి కర్రెగుట్టలపై బాంబులు అమర్చినట్లు తెలిపారు. బాంబులు అమర్చిన విషయం ప్రజలకు వివిధ రూపాల్లో తెలిపినట్లు, అయినప్పటికీ కొద్ది మంది ఆదివాసీలు, ఆదివాసీయేతరులకు పోలీసులు మాయమాటలు చెప్పి నమ్మిస్తూ, డబ్బులు ఇస్తూ ఇన్‌ఫార్మర్‌లుగా మార్చుకొని షికారు పేరుతో కర్రెగుట్టలపైకి పంపిస్తున్నారని తెలిపారు. మావోయిస్టుల రక్షణ కోసం అమర్చిన బాంబుల బారిన పడి చనిపోతున్నారని, కొంత మంది గాయపడుతున్నారని అన్నారు. పోలీసుల మాటలు నమ్మి ఇన్‌ఫార్మర్‌లుగా మారొద్దని పేర్కొన్నారు.

చర్చనీయాంశంగా మావోయిస్టుల లేఖ

ఛత్తీస్‌గఢ్‌లో నిర్బంధం ఎక్కువైన క్రమంలో తెలంగాణలోకి ప్రవేశించడానికి ఈ అడవే మావోయిస్టులకు దిక్సూచి. వారికి అడ్డుకట్ట వేసేందుకు నిఘా వేసిన పోలీసులు ప్రతిక్షణం అలర్ట్‌గా ఉంటున్నారు. ఇటీవలి కాలంలో ఛత్తీస్‌గఢ్‌లో వరుసగా భారీ ఎన్‌కౌంటర్లు జరుగుతుండగా పదుల సంఖ్యలో మావోయిస్టులు ప్రాణాలు వదలుతున్నారు. చాలామంది లొంగుబాటను ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న మావోయిస్టు లీడర్లు తెలంగాణ దండకారణ్యంలోకి వచ్చే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే మావోయిస్టుల పేరిట విడుదలైన లేఖ చర్చనీయాంశంగా మారింది. గతనెల 23న వెంకటాపురం మండలం ఇప్పగూడానికి చెందిన బొగ్గుల కృష్ణమూర్తి అనే వ్యక్తి ముత్యంధార జలపాతం సమీపంలో అడవిలోకి వెళ్లగా ప్రెషర్ బాంబు పేలి తీవ్రంగా గాయపడ్డాడు. అంతకుముందు వాజేడు మండలం జగన్నాథపురానికి చెందిన ఇల్లందుల ఏసు అనే వ్యక్తి మరణించగా, వెంకటాపురం మండలం అంకన్నగూడానికి చెందిన నవీన్, చొక్కాల గ్రామానికి చెందిన డర్రా సునీత తీవ్రంగా గాయపడ్డారు. అయితే.. ఈసంఘటనలను ఏనాడూ స్పందించని మావోయిస్టులు కర్రెగుట్టల చుట్టూ తాము మందుపాతరలు అమర్చామని తొలిసారి ప్రకటించారు. కగార్ పేరిట జరుగుతున్న దాడుల నుంచి రక్షణ కోసమే బాంబులు పెట్టామని, ఈవిషయాన్ని పలు రూపాల్లో ప్రజలకు తెలియపర్చినట్లు లేఖలో పేర్కొన్నారు. పోలీసులు అమాయక గిరిజన, గిరిజనేతరులకు డబ్బు ఆశగా చూపించి ఇన్‌ఫార్మర్లుగా మార్చుకుంటున్నారని, అటవీ జంతువుల వేట పేరుతో అడవుల్లోకి పంపించి తమ కదలికలను తెలుసుకుంటున్నారని తెలిపారు. ఈక్రమంలో తాము అమర్చిన బాంబులు పేలి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని వెల్లడించారు. ప్రజలెవరూ పోలీసుల మాటలను నమ్మి మోసపోవద్దని, కర్రెగుట్టలపైకి రావొద్దని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడం లేదని ఏడాది పాలనలోనే తేలిపోయిందని మావోయిస్టు నేత శాంత ఆ లేఖలో ప్రస్తావించారు. ఆరు గ్యారెంటీలతో పాటు ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ చేస్తామని ప్రకటించి, ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. కాంగ్రెస్‌పాలనలో ప్రజలఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని, భూస్వాములు, పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం ప్రజల ఆస్తులను బలవంతంగా గుంజుకుంటున్నారని విమర్శించారు.

బాంబు డిస్పోజల్ బృందాలతో కర్రెగుట్టలపై తనిఖీలు


▸▸ ప్రజలను ఇన్‌ఫార్మర్లనడం సరికాదు ▸▸ ములుగు ఎస్పీ శబరీశ్

ములుగు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు బాంబులు అమర్చిన కర్రెగుట్టల వద్ద భద్రతా చర్యలను పటిష్ఠం చేస్తున్నామని, బాంబు డిస్పోజల్ టీమ్‌లతో నిత్యం తనిఖీలు జరుపుతూ తొలగిస్తామని ములుగు జిల్లా ఎస్పీ శబరీశ్ తెలిపారు. సరిహద్దు గ్రామాల ప్రజలు ఆందోళనకు గురికావొద్దని, ఎవరికైనా బాంబుల ఆనవాళ్లు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు మంగళవారం మీడియాకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మావోయిస్టు పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోతోందని, ఉనికిని కాపాడుకునేందు కోసం కర్రెగుట్టల వద్ద ప్రెషర్ బాంబులు అమర్చారని తెలిపారు. అటు ఛత్తీస్‌గఢ్, ఇటు తెలంగాణ సరిహద్దు గ్రామాల ప్రజలు అటవీ ఉత్పత్తుల సేకరణే జీవనాధారంగా బతుకుతున్నారని, ఈక్రమంలో బాంబులు పేలి ప్రమాదానికి గురవుతున్నారని తెలిపారు. వారిని ఇన్‌ఫార్మర్లంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మావోయిస్టుల చర్యలను పౌరహక్కుల సంఘాలు ఖండించాలని కోరారు.

రెండెకరాల్లో మొక్కజొన్న పంట దగ్ధం

- సుమారు రూ.2 లక్షల మేర నష్టం
- మంటలు ఆర్పే క్రమంలో మహిళా రైతుకు గాయాలు

కొత్తగూడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని పెగడపల్లిలో మంగళవారం జరిగింది. మంటలు ఆర్పే కమంలో మహిళా రైతుకు గాయాలు కాగా, కావాలనే పంటను కాల్చేశారని రైతు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాధిత రైతు వివరాల ప్రకారం... పెగడపల్లి గ్రామానికి చెందిన బొల్లు రవి సుమారు 10 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశాడు. పంట చేతికి అందివచ్చిన క్రమంలో మొక్కజొన్నను కోసేందుకు రైతు సిద్ధం అవుతున్నాడు. మంగళవారం రవి చేనుకు సమీపంలో ఎవరో చెత్తను కాల్చివేస్తుండగా, మంటలు లేచి గాలికి వ్యాపించి మొక్క జొన్న పంటవైపు వ్యాపించింది. పంటకు అంటుకోగానే రైతు భార్య భర్తకు సమాచారం ఇచ్చింది. మంటలు ఆర్పే క్రమంలో మహిళ గాయపడింది. రవితో పాటు గ్రామస్థులు తరలి వచ్చి మంటలే ఆర్పివేసే ప్రయత్నం చేసేలోపు రెండు ఎకారాల్లో పంట దగ్ధమైంది. సుమారు రూ.2లక్షలు నష్టం వచ్చినట్టు బాధిత రైతు పేర్కొన్నారు. కాగా, కొందరు కావాలనే పంటకు నిప్పు పెట్టారని బాధిత రైతు అనుమానం వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్టు రవి పేర్కొన్నారు.



కొత్తగూడ మండలం పెగడపల్లిలో కాలిపోతున్న మొక్కజొన్న పంట

అమినాపురంలో ఎకరం మొక్కజొన్న దగ్ధం

కేసముద్రం: కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలోని అమినాపురంలో యారు రమేష్‌కు చెందిన ఎకరం మొక్కజొన్న చేను మంగళవారం దగ్ధమైనట్లు బాధిత రైతు తెలిపారు. పొరుగున ఉన్న రైతు సొప్ప కాల్చడంతో నిప్పు వ్యాప్తి చెంది తన చేనుకు నిప్పంటుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనలో రూ.50వేల విలువైన మొక్కజొన్న కంకులు కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు.

నష్టపోయిన రైతులకు
పరిహారం అందిస్తాం

▸▸ కాంగ్రెస్ ములుగు జిల్లా అధ్యక్షుడు అశోక్

గోవిందరావుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సోమవారం సాయంత్రం కురిసిన వడగండ్ల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామని, దెబ్బతిన్న ఇళ్ల బాధితులకు అండగా ఉంటామని కాంగ్రెస్ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన ఆర్డీవో వెంకటేశ్, కాంగ్రెస్ నాయకులతో కలిసి మండలంలోని రంగాపూర్, గోవిందరావుపేట, రాఘవపట్నం, కోటగడ్డ, పస్రా గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాలంగా కురిసిన వడగండ్ల వర్షం, సుడిగాలుల బీభత్సానికి ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయి నిలువనీడ లేకుండా అయిందని, మామిడితోటల్లో మామిడికాయలు రాలిపోయి రైతులు చాలా నష్టపోయారని అన్నారు. దెబ్బతిన్న పంటలకు, దెబ్బతిన్న ఇళ్ల మరమ్మతులకు పరిహారం అందిస్తామని ఆయన పేర్కొన్నారు. వడగండ్ల వర్షం, సుడిగాలి బీభత్సంతో సుమారు 170ఎకరాల్లో మామిడితోటలు, 6వేల ఎకరాల్లో వరిపంటకు నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నామని అన్నారు. అధికారులు మండలంలోని గ్రామాల్లో సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా, మండల, గ్రామ నాయకులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



WANTED
★ Wanted Marketing PRO'S for Reputed Degree College, Hanamakonda. Contact : 8801220067, 9676481370
AJW-217385

WANTED
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు టెలికాలర్స్, రిసెప్షనిస్ట్, సిస్టమ్ ఆపరేటర్స్ అర్జెంటుగా కావలెను. జీతం : 8,000-10,000. సం॥ప్ర॥9440414616
AJW-217387

WANTED
★ Wanted Marketing Boy and Receptionist, to work in a reputed Diagnostics Centre, Hnk & Wgl. With Good Communication Skills. Contact : 9676042002, 9700288200, 9393113929.
AJW-7648

WANTED
★ శ్రీ సాయిరాం హోమ్ కేర్ హైదరాబాద్‌లో బేబి కేర్, పేషెంట్ కేర్, ముసలి వాళ్ళను చూసుకొనుటకు ఆయాలు, నర్సులు & ఇంటిపని, వంటపనికి మనుషులు కావలెను. జీతం: 18,000/- : 9949094607, 9908454607
AJB-47

WANTED
★ జూన్‌లో ప్రారంభమయ్యే మా భారతీయ డే-కేర్, ప్లే స్కూల్, నర్సరి-2nd కి అడ్మిషన్లు జరుగుతున్నవి. 27సం॥ల వ్యాపార దృష్టి లేని స్కూల్. క్లర్క్ /ఆయా/ వాచ్‌మన్ కావలెను. సం॥ప్ర॥ 8801066232
AJW-237152

WANTED
★ మడికొండ (ధర్మసాగర్) దగ్గరలో ఉన్న పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మంచి ఉత్సాహవంతులైన వర్కర్స్ కావలెను. సెల్ : 8247771016, 8247771525.
AJM-12942

WANTED
★ శివకార్తికేయ హోంకేర్ నందు వృద్ధులను / పేషంట్స్‌ని / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని / వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph.: 99120 11499, 99120 11899.
AJH-003142

అర్జెంటుగా కావలెను
★ వరంగల్ MGM దగ్గరలో హోటల్‌లో పనిచేయుటకు టిఫిన్ మాస్టర్ భార్యభర్తలు కావలెను. Food + అకామిడేషన్. జీతం : 16,000/-. MG Road Wgl. సం॥ప్ర॥ 9573637686
AJW-5796

సెక్యూరిటి గార్డ్స్ & సూపర్‌వైజర్స్ కావలెను
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటి గార్డ్స్ మరియు సూపర్ వైజర్స్ కావలెను. జీతం॥ 12,000-16000. సం॥ప్ర॥ 8309693457
AJW-217384

EDUCATION
★ STUDY HALL Rs 1000 seat P.M.1st 30 seats 500 this month offer. Registration Time:- 10.00 to 5.00 pm 9391622073. Inspire Professionals, 2nd flr, MAYURI PLAZA, Kishanpura HNK
AJM-12939

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-

గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ
9985400013
8978510273
9985411677
9985411676
వరంగల్
9985406150
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9985418040
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232

3+2 స్కీం కలదు

ఎండలవేళ పశువులు జాగ్రత్త



» అధిక ఉష్ణోగ్రతలతో మూగజీవాలకు ప్రమాదమే..
» పశుపోషణలో యజమానులు మెళకువలు పాటించాల్సిందే

ఖానాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో మనుషులే కాదు మూగజీవాలు కూడా వడదెబ్బకు గురవుతుంటాయి. ఎండల వేళ పశుపోషణలో మెళకువలు పాటించకపోతే వాటి ప్రాణానికి ప్రమాదమే. యజమానులకు నష్టమే మిగులుంది. అధిక ఉష్ణోగ్రతలు, గాలి ప్రసరణ సరిగా లేకపోవడం, పాకల్లో అధిక సంఖ్యలో జీవాలను కిక్కిరిసి ఉంచడం, నీళ్ల అందుబాటులో లేకపోవడం వల్ల పశువులు, గొర్రెలు, మేకలు వడ దెబ్బకు గురవుతాయి. వడదెబ్బకు గురైన పశువులు క్రమంగా నీరసించి బలహీనంగా మారుతాయి. వాటి చర్మం పొడిబారుతుంది. పశువుల సరిగా నడవలేక తూలుతూ ఉంటాయి. జీవక్రియ తగ్గిపోయి ఆకలి మందగిస్తుంది. దీంతో ఆహారం తక్కువగా తీసుకుంటాయి. పశువులు ఎదకు రాకపోగా చూడికట్టే అవకాశాలు తగ్గిపోతాయి. రోగ నిరోధక శక్తి తగ్గడం వల్ల ఇతర వ్యాధులు, పరాన్న జీవులు ఆశించే అవకాశం ఉంటుంది. చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి, ఎండ వేడిమికి దాణ సరిగా తినక పోవడం మూలంగా పాల దిగుబడి తగ్గిపోతుంది. ఎండ నుండి పశువులను రక్షించుకుంటేనే పాడి పోషణ లాభదాయకంగా ఉంటుంది.

పాకల్లో చల్లదనం కోసం ఏర్పాట్లు

పశువుల పాకల్లో పైకప్పులకు తెల్లరంగు వేసి ఆపై గడ్డి, తాటి, కొబ్బరి వంటి ఆకుల్ని పరచడం లాంటి చర్యల ద్వారా ఎండ వేడి షెడ్లలోకి ఎక్కువగా ప్రవేశించకుండా చూడవచ్చు. మధ్యాహ్న సమయంలో పాకల చుట్టూ గోతాలు, పరదాలు వేలాడదీసి వాటిని తరుచు నీటితో తడపడం మంచిది. అత్యధిక పాలిచ్చే సంకరజాతి ఆవులు, ముర్రా గేదెలకు ఫ్యాన్లను ఏర్పాటు చేయడం ఎంతో అవసరం. పశువుల పాకలను ఎప్పటికప్పుడూ శుభ్రం చేస్తూ గాలి ధారాళంగా ప్రసరించే విధంగా చూడాలి. పశువులను రోజుకు రెండు మూడు సార్లు చల్లని నీటితో కడగాలి.

మెళకువలు పాటించాలి

వేసవిలో పశువులకు అందించే మేత, దాణాలో మెళకువలు పాటిస్తేనే పాడి పోషణ లాభాదాయకంగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో మేతకు తీసుకెళ్లాలి. వేసవి తాపంతో పశువుల్లో జీర్ణక్రియ మందగిస్తుంది. అందువల్ల సులువుగా జీర్ణించుకునే పిండి పదార్థాలైన గంజి, జావ వంటివి అందించాలి. ఎక్కువ శాతం పచ్చిగడ్డి అందించాలి. మాగుడు గడ్డి ఉంటే సంవృద్ధిగా అందించాలి. పచ్చిగడ్డిని ఉదయం, ఎండు గడ్డిని రాత్రి సమయాల్లో కత్తిరించి ఇవ్వాలి. అధిక పాలు ఇచ్చే పశువులకు దాణాతో నీటిని కలిపి ఇవ్వాలి. మినరల్ మిక్చర్, ఉప్పు కలిపిన ద్రావణం ఇవ్వడం మరీ మంచిది. అలాగే వేసవిలో పశువుల్లో తాగునీటి అవసరాలు రెట్టింపవుతాయి. చల్లని శుభ్రమైన నీటిని పశువులకు ఎప్పుడూ అందుబాటులో ఉంచాలి. నీటి తొట్లను నీడలో ఉంచాలి. సాధ్యమైనంత వరకు ఎక్కువ నీళ్ల తాగేలా చూడాలి.

టీకాలు తప్పనిసరి

ఎండాకాలంలో పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. దీంతో పశువులు సులువుగా జబ్బుల బారినపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గొంతు, జబ్బవాపు, గాలికుంటు వంటి వ్యాధులు రాకుండా టీకాలను ఇప్పించాలి. అంతర పరాన్న జీవుల నిర్మూలనకు నట్టల మందులను తాగించాలి.

పశువుల్లో వడదెబ్బ లక్షణాలు.. నివారణోపాయాలు

వడదెబ్బకు గురైన పశువుల్లో నాలుక బయట పెట్టడం, నీరు తాగకపోవడం, మేత తినకపోవడం, మూత్ర విసర్జన ఆగిపోవడం లాంటి లక్షణాలు కలిపిస్తాయి. ముట్టెపై చెమట లేకపోవడం, కళ్లలో ఎర్రటి చారలు, నెమరు వేయలేకపోవడం తదితర లక్షణాలు ఉంటాయి. ఈ లక్షణాలు పశువుల్లో కనిపించిన వెంటనే ఉప్పు, బెల్లం కలిపిన ద్రావణం తాగించాలి. నిత్యం నాలుగైదు సార్లు చల్లని తాగునీటిని అందించాలి. పశు వైద్యుడి సహాయంతో చికిత్స అందించాలి.

పశువులకు వెంటనే చికిత్స చేయించాలి

శ్రీలక్ష్మి, పశువైద్యాధికారి, ఖానాపురం



వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వచ్చే ప్రదేశంలోకి తీసుకెళ్లాలి. శరీర ఉష్ణోగ్రతను తగ్గించేందుకు పలుమార్లు నీటితో కడగాలి. చల్లని గోనె సంచిని కప్పడం లాంటివి చేయాలి. పశువైద్యుడి పర్యవేక్షణలో చికిత్స అందించాలి. వైద్యాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.

కాళేశ్వరం.. మునులు, రుషుల తపోక్షేత్రం

» భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న ముక్తీశ్వరుడి సన్నిధి
» ఈ ఏడాది సరస్వతీ పుష్కరాల వైభవం

మహదేవపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : భక్తుల కొంగు బంగారంగా.. బ్రహ్మ విద్యల తపోక్షేత్రంగా.. ఎందరో రుషులు, మునులు తపస్సులు చేసిన పుణ్యస్థలంగా.. ఎన్నో పాతకాలను పారదోలిన శైవ క్షేత్రంగా.. వేదకాలం నుంచి స్వచ్ఛ గోదావరి తరగలతో జన్మ తరింపజేసుకున్న పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది కాళేశ్వరం. బ్రాహ్మణ అగ్రహారాలుగా విశ్వ విఖ్యాతి గాంచిన మంత్రకూటం, చెన్నూరు, కాళేశ్వరం పుణ్యతీర్థ క్షేత్రాలు.. సంప్రదాయ షట్శాస్త్రాలు, పురాణ ఇతిహాసాలను పఠించి భావితరాలకు అందజేసిన జాబాలి, అగస్త్యుడు, గౌతముడు నడయాడిన కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహితల మధ్యలో అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతి నదికి ఈ ఏడాది పుష్కరాల వైభవం సంతరించుకుంది. వేదవ్యాస మహర్షి స్కంద పురాణంలో కాశీ ఖండంలో పేర్కొన్న సమాచారం కాళేశ్వర క్షేత్రం ప్రసిద్ధిగా నిలుస్తోంది. భారతదేశ యాత్ర ప్రారంభించిన అగస్త్య మహర్షి గోదావరి జన్మస్థానమైన నాసిక్ త్రయంబకం క్షేత్రంలో స్నానమాచరించి వ్యాస ప్రతిష్ఠ సరస్వతిని దర్శించి కాళేశ్వరంలో త్రివేణి సంగమంలో స్నానమాచారించారు. తన యాత్రకు గుర్తుగా చెన్నూరులో అగస్త్యేశ్వరస్వామి లింగ ప్రతిష్ఠ చేయించారు. నేటికీ చెన్నూరు ఆలయంలో అగస్త్యేశ్వరుడి పురాతన ఆలయంలో పూజలు కొనసాగుతున్నాయి. 400 ఏళ్లుగా అఖండ జ్యోతి దీపం వెలుగుతుండడం విశేషం. అలాంటి ఎంతో విశిష్టతలు కలిగిన ఈ పుణ్యక్షేత్రాన్ని సరస్వతీ పుష్కరాల వేళ దర్శించుకుంటే ఎంతో మంచిదని పండితులు చెబుతున్నారు. వచ్చేనెలలో సరస్వతీ పుష్కరాల వేళ కాళేశ్వరం చరిత్ర గురించి ప్రత్యేక కథనం.

● సహజ కవి బమ్మెర పోతన తెలుగులో మహా భాగవతం రాయాలనే తపనతో ఏమి తోచని పరిస్థితిలో కాళేశ్వరం అంతర్వాహిని సరస్వతి త్రివేణి సంగమంలో స్నానం చేసి శ్రీకారం చుట్టినట్టు అభినవ పోతన వానమమలై వరదాచార్యులు రాసిన పోతన చరితము తెలుపుతోంది. గౌతమ మహర్షి శిష్యులకు వేద పఠనం చేస్తున్న సమయంలో మంత్ర కూటం ప్రాంతంలో కరువు కాటకాలు వచ్చాయి. తపోబలంలో ఏ రోజుకారోజు పంట పండించి శిష్యులకందిస్తే అసూయపరులు కుట్రలతో మాయా ధేనువు సృష్టించిన వేళ దర్భ కర్రతో అదిలించగా గోవు మృతిచెంది గౌతమ మహర్షికి గోహత్యా పాతకం కలిగింది. నివారణ కోసం కాళేశ్వరంలో సరస్వతీ మాతను దర్శించి శివుడి కోసం తపస్సు చేసుకుని గోదావరితో కూడిన మహాసరస్వతిని దర్శించడంతో గోహత్యా దోషం నివృత్తి కలిగిందని, అందుకు సాక్ష్యమే మంత్రకూటంలో గౌతమేశ్వరాలయమని కాళేశ్వర ఖండంలోని కథనం చెబుతోంది.

● కాళేశ్వరం క్షేత్రంలో అష్టతీర్థాలు శివుని ఎనిమిది రకాల రూపాలకు సాక్ష్యాన్ని కథలున్నాయి. కొందరు దొంగలు ప్రతి రోజు కాళేశ్వరం ప్రాంతంలో దొంగతనాలు చేసి తెల్లవారుజామున పరుగెత్తి వెళ్లేవారు. రాజులు వేసిన శిక్షలు అనుభవించి బాధపడేవారు. జాబాలితో సహా పస్తర్షులు ఎదురుపడి పాప పరిహారం కోరారు. వారు గోదావరి నీరు చల్లగానే ప్రాణాలు కోల్పోయారు. రుషులకు బ్రహ్మత్యా పాతకం కలగ్గా నివారణకు కాళేశ్వరం చేరి సరస్వతి సంగమంలో స్నానం చేసి పునీతులయ్యారట. తర్వాత కొన్నాళ్లకు రుషులు కాశీకి వెళ్లగా నాటి దొంగలే మహారాజులుగా కనిపించి రుషులను గౌరవించి ఆదరించారు. కాశీలో విద్యాలయాల్లో కాళేశ్వరం అంతర్వాహిని సరస్వతి త్రివేణి సంగమం ప్రాచుర్యాన్ని ప్రచారం చేయించారు.



కాళేశ్వర ఆలయం

● త్రేతాయుగంలో శ్రీరాముడు పంచవటిలో సీతాపహరణం జరిగిన తర్వాత భరించరాని తాపంతో ప్రయాణిస్తూ కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహిత, సరస్వతి త్రివేణి సంగమంలో స్నానమాచరించి ముక్తీశ్వరుడిని పూజించారట. సుగ్రీవుని చొరవతో దేశంలోని రుషులందరిని పిలిపించి యజ్ఞయాగాలు చేయించనట్లు పురాణాలు చెబుతున్నాయి. కాళేశ్వరం నదీతీరంలో హనుమత్ తీర్థం, వీరాంజనేయస్వామి దేవాలయం, శ్రీ సీతారామ చంద్రమూర్తి ఆలయాలు అందుకు సాక్ష్యాలుగా ఉన్నాయని వేదపండితులు చెబుతున్నారు.

● ఇక శివతత్వాన్ని గ్రామీణులకు వివరించేందుకు పదకొండో శతాబ్దంలో నీలకంఠేశ్వరాధ్యుడు ఎంతో కృషి చేశాడు. నారదబ్రహ్మ సూత్రాలకు వ్యాఖ్యానం రాసి.. గోదావరి పరివాహక ప్రాంతం మధ్వాచార్యుల తీరంలో సోన్‌సమీపంలో నిర్మల్‌కు చెందిన నిర్మల శంకరశాస్త్రీ నీలకంఠేశ్వర వ్యాఖ్యానానికి వివరణ, విశ్లేషణ రాశారు. ఆ గ్రంథంపై ప్రముఖ తత్వవేత్త, పూర్వ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ముందుమాట ఉపోద్ఘాతం రాయడం విశేషం. కాళేశ్వరం, చంద్రువెల్లి ప్రాంతాల్లో వేద పాఠశాలలు నెలకొల్పి వీరభద్ర పండిత శివారాధ్యులు కాళేశ్వరం సరస్వతీ క్షేత్ర మహిమలు ఎల్లవేళలా ప్రాచుర్యం పొందేలా చేశారు. కాకతీయుల సామ్రాజ్యంలో విద్యారణ్యుల శిష్య పరమాణువు కాళేశ్వరం రాజయ్యారాధ్యులు కాళేశ్వర ఖండం గ్రంథం ముద్రణలో చొరవ చూపారు. కాకతీయులు కాళేశ్వరం త్రివేణి సంగమంలో రాజు శిరం బరువుకు సమానమైన ధనం తులాపురుషదానం చేసి తరించినట్టు గయా క్షేత్రంలో లభించిన శాసనం ద్వారా తెలుస్తోంది. ఈ విధంగా సరస్వతీ అంతర్వాహినిగా ఉన్న గోదావరిలో సరస్వతీ పుష్కరాల సమయంలో స్నానం చేయడం ద్వారా పిల్లలకు విద్యా విజ్ఞానం పెరుగుతుందని, అది తమ అదృష్టమని భక్తులు భావిస్తారు.

పట్టాలు పొందిన వేళ.. ఆనంద హేల



కూతురు పట్టా అందుకున్న ఆనందంలో తల్లిదండ్రులు



విద్యార్థికి ఎంబీబీఎస్ పట్టా అందజేస్తున్న కాళోజీ వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి, కేఎంసీ ప్రిన్సిపాల్ రామ్‌కుమార్‌రెడ్డి, తదితరులు

• అట్టహాసంగా కేఎంసీ 61వ గ్రాడ్యుయేషన్ డే
• ఆనందంతో పులకరించిన తల్లిదండ్రుల మనసులు
• వైద్యులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలి : కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెడికల్ కళాశాలలో 61వ గ్రాడ్యుయేషన్ డే మంగళవారం రాత్రి అట్టహాసంగా జరిగింది. 2019 బ్యాచ్‌కు చెందిన 230మంది విద్యార్థులు ఎంబీబీఎస్ పట్టాలు అందుకోగా.. వారిని చూసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పులకించిపోయారు. ఆనందంతో వారిని ముద్దాడారు. తమ కలలు సాకారం చేశారంటూ ఆనందం వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ నందకుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు పట్టాలు అందజేసిన ఆయన మాట్లాడుతూ.. సమాజ ఆరోగ్య వికాసానికి వైద్యులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, యువ వైద్యులు నిబద్ధతతో వృత్తి ధర్మాన్ని పాటించాలని సూచించారు. వైద్యుడిని దేవునితో సమానంగా కొలిచే సమాజంలో ఉన్నామన్న విషయాన్ని మరువొద్దని, ప్రజల్లో ఉన్న ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా యువ వైద్యులు కృషి చేయాలని కోరారు. అంకితభావమున్న వైద్యు లను సమాజం ఆదర్శవంతంగా చూస్తుందని అన్నారు. ఇదే కళాశా లలో పట్టాలు పొందిన అనేక మంది వైద్యులు విశిష్టమైన సేవలు అందించి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని కొనియాడారు. ఇలాంటి స్ఫూర్తి దాయకమైన కేఎంసీ నుంచి పట్టాలు పొందిన యువ వైద్యు లు అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అలాగే ఎంత ఎత్తు ఎదిగినా తాము చదువుకున్న కళాశాల, అధ్యా పకులు మరవకూడదని హిత వు పలికారు. ఈ కార్యక్ర మంలో కాళోజీ నారాయణ రావు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సంధ్య, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ విజయలక్ష్మీ, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ మురళీ తదితరులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డేలో మాట్లాడుతున్న కాళోజీ వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి

న్యూరో సర్జన్ అవుతా..

పిన్నింటి భార్గవి



ఎంబీబీఎస్ పట్టా పొందటం ఆనందంగా ఉంది. న్యూరో సర్జన్ కావాలని లక్ష్యంగా పెట్టుకున్నా. మా అమ్మ పద్మశ్రీ, నాన్న వెంకటేశ్వర్‌రావు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. చిన్నప్పటి నుంచి వారు అందించిన ప్రోత్సాహంతోనే నేను వైద్య విద్య వైపు వచ్చా. వైద్య విద్య పూర్తి చేసిన మా పెదనాన్న కొడుకు కూడా నాకు స్ఫూర్తి. భవిష్యత్‌లో ఆరోగ్య వికాసానికి సేవలందిస్తా.



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

పచ్చదనానికి ప్రణాళిక సిద్ధం

➡ హరితహారానికి మొక్కలు సన్నద్ధం
➡ ముమ్మరంగా బ్యాగ్ ఫిల్లింగ్ పనులు
➡ మండలంలో 3.90 లక్షల మొక్కల లక్ష్యం

నెక్కొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అంతరించిన అడవులకు ఊపిరి పోయడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు హరితహారం తోడ్పడనుంది. త్వరలో నిర్వహించనున్న పదకొండో విడత హరితహారం విజయవంతం చేయడానికి అధికారులు మొక్కలు సిద్ధం చేస్తున్నారు. మొక్కలు నాటడంతో అంతరించిపోతున్న అడవులకు ఊపిరి పోయడమే కాకుండా, వర్షాలు సమృద్ధిగా కురవడానికి, వాతావరణంలో కాలుష్య నివారణకు పచ్చదనం ఎంతో ముఖ్యమని ప్రజలకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. హరితహారం కోసం అవసరమైన మొక్కలు పెంచడానికి మట్టి, విత్తనాల సేకరణపై అధికారులు దృష్టి పెట్టారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా హరితహారం కోసం నెక్కొండ మండలంలోని 39 గ్రామపంచాయతీలలో నర్సరీలను ఏర్పాటుచేసి వాటిలో మొక్కలు పెంచుతున్నారు. ఈ నర్సరీలలో 3.90లక్షల మొక్కలు పెంపకం లక్ష్యంగా పెట్టుకొని ప్రణాళికలను సిద్ధంచేశామని సంబంధిత అధికారులు తెలిపారు.

6 నుంచి 8 వేల మొక్కల పెంపకం లక్ష్యం

గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీలో 6 నుంచి 8 వేల మొక్కలను పెంచడానికి అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం నర్సరీల్లో బెడ్‌ల ఏర్పాటు, ప్లాస్టిక్ కవర్లలో మట్టి నింపే పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి నర్సరీలకు విత్తనాలను ఆరు నెలల కిందటే సరఫరా చేశారు. పూల మొక్కలు, పండ్ల మొక్కలైన బొప్పాయి, జామ, నిమ్మ, సీతాఫలం, రామాఫలం, నారింజ, నేరేడుతో పాటు వృక్ష సంబంధిత మొక్కలైన గుల్‌మోహర్, వేప, కానుగ, టెంటోఫోరం, మునగ, టెకోమా పెంచుతున్నారు.



మొక్కల కలుపు తీస్తున్న కూలీలు



పక్షుల నుంచి రక్షణకు..

నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండ తీవ్రతనుంచి తట్టుకోవడానికి రోజుకు కనీసం మూడుసార్లు నీరు అందిస్తున్నారు. అలాగే మొక్కలకు ఎండ తీవ్రత నుంచి రక్షణకు గ్రీన్ పట్టాను ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల ఎండ తీవ్రత నుంచి తట్టు కోవడంతోపాటు, పక్షుల నుంచి కూడా రక్షణ ఉంటుంది.

మల్టీలేయర్ పద్ధతిలో..

నర్సరీలో పెంచిన మొక్కలను హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలు, దేవాలయాల అవరణలో, కాలువ, చేరువుల గట్లపై, రోడ్డు వెంట మల్టీలేయర్ అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టనున్నట్లు అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే నర్సరీలో పెంచిన మొక్కలను పల్లె ప్రకృతి వనాలకు సరఫరా చేస్తామన్నారు.

ఉపాధి పథకం ద్వారా..

గ్రామాల్లో వ్యవసాయ పనులు లేని సమయంలో కూలీలు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా నర్సరీల్లో మొక్కల పెంపకం ద్వారా కూలీలకు పనులు దొరుకుతున్నాయి. నర్సరీలో పనులు చేస్తున్న కూలీలకు రోజుకు రూ.250 వరకూ కూలి పొందుతున్నారు.

మూడు నెలల్లో మొక్కలు సిద్ధం

వి.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో, నెక్కొండ



గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహిస్తున్న నర్సరీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మొక్కలను హరితహారానికి సిద్ధం చేస్తున్నారు. మూడు నెలల్లో వచ్చే జూన్ నాటికి 3.90లక్షల మొక్కలు అందిస్తాం. నర్సరీల నిర్వహణ విషయంలో గ్రామ సర్పంచ్, కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.

ఇంటింటికీ ఆరు మొక్కల పంపిణీ

యాదగిరి, గుండ్రపల్లి నర్సరీ వాచర్



వర్షాకాలం ఆరంభంలో మండలంలోని గ్రామాల్లో మొక్కలను పంపిణీ చేయడానికి సిద్ధం చేస్తున్నాం. ప్రతీ మొక్క ఎదిగేందుకు కవర్లలో మొక్కతో పాటు పెరుగుతున్న కలుపు తీస్తున్నాము. ప్రతీ ఇంటికి పండ్లు, పూల మొక్కలు ఆరు చొప్పున పంపిణీ చేస్తాం. మొక్కలు ఎండకు ఎండకుండా నిత్యం నీరు పడుతున్నాం.

ఆ ఉపాధ్యాయుడు.. ఆదర్శప్రాయుడు

» వృత్తిపై అంకితభావం.. సేవే ఆయన మార్గం
» తొమ్మిది 'ఉత్తమ' అవార్డులు అందుకున్న శ్రీనివాస్

పర్వతగిరి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆయన ఉపాధ్యాయుడిగా వృత్తిలోనే కాదు సమాజ సేవలోనూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎంతో మంది విద్యార్థులకు చదువు చెప్పడమే కాదు వారి తల్లిదండ్రులతో మమేకమై ఆ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పునాది వేశారు. అంతే కాదు పర్యావరణ పరిరక్షణపైనా ప్రత్యేక శ్రద్ధ చూపడం, సామాజిక సేవాభావం కలిగిన ఆయన తొమ్మిది సార్లు ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు అందుకుని తనకంటూ ప్రత్యేక స్థానాన్ని నిలుపుకొన్నారు. ఆయనే వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అప్పల్‌రావుపేట గ్రామానికి చెందిన మడత కొంరయ్య, మడత ఎల్లమ్మ దంపతుల కుమారుడు మడత శ్రీనివాస్. పేదకుటుంబంలో పుట్టిన శ్రీనివాస్ పాఠశాల స్థాయి విద్యాభ్యాసమంతా ప్రభుత్వ పాఠశాలలోనే పూర్తి చేశారు. బీకాం సీకేఎం కళాశాలలో 1983-86వరకు పూర్తి చేసి అనంతరం కాకతీయ యూనివర్సిటీలో 1986-88లో ఎంకాం పూర్తిచేసి 1988-89లో వరంగల్‌లోని బీఈడీ కళాశాలలో చదివారు. 1989లో డీఎస్సీకి ఎంపికై డిసెంబరు 1990లో వరంగల్ జిల్లా నెక్కొండ మండలం వెంకటాపూర్ ఎంపీపీఎస్‌లో స్పెషల్ టీచర్‌గా ఉద్యోగంలో చేరారు. అక్కడ 1992 వరకు పనిచేసి అనంతరం అదే ఏడాది ఆగస్టులో పెద్దకొర్పోల్ జడ్పీహెచ్‌ఎస్‌కు బదిలీ అయ్యారు. అక్కడ 2002 వరకు పనిచేసి అనంతరం 2006లో ఎంపీపీఎస్‌లో హెచ్‌ఎంగా పదోన్నతి పొందారు. అదే సంవత్సరంలో డోర్నకల్ మండలం పెరుమండ్ల సంకేసి జడ్పీహెచ్‌ఎస్‌కు బదిలీ అయి.. 2009 జూలై వరకు పనిచేసి పర్వతగిరి మండలంలోని ఎంపీయూపీఎస్‌కు బదిలీపై వెళ్లారు. అక్కడ 2018వరకు ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి విద్యారంగ అభివృద్ధికి తోడ్పాటునందించారు. జూలై 2018లో అదే మండలంలోని బూర్గుమల్ల ఎంపీయూపీఎస్‌కు బదిలీ అయి హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ఇలా 15 సంవత్సరాల పాటు ఉపాధ్యాయునిగా, 20 ఏళ్ల పాటు ప్రధానోపాధ్యాయునిగా వివిధ పాఠశాలల్లో పనిచేసి తనదైన ముద్రను వేసుకున్న ఆయన ఈ నెలాఖరులో పదవీవిరమణ పొందబోతున్నారు.

వృత్తిలోనే కాదు.. సేవల్లోనూ అంకితభావం..

ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్న సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, వారికి అవగాహన కల్పించి మరీ పాఠశాలలను కాపాడడంలో శ్రీనివాస్ కీలక భూమిక పోషించారు. ప్రధానంగా బస్సు మార్గంలేని తండాలలో కొంత వరకు సొంత ఖర్చులు వెచ్చించి ప్రైవేటు వాహనాల ద్వారా పిల్లలను స్కూల్‌కు రప్పించారు. 35 ఏళ్ల ఉపాధ్యాయ జీవితంలో ఏ రోజు కూడా గైర్హాజరైన దాఖలాలులేవని తోటి ఉపాధ్యాయులు చెబుతున్నారు. అత్యవసరమైతే చట్టపరమైన సెలవుతీసుకుంటారు. అంతేకాదు.. ఏదైనా రోజు ఒక్క నిమిషం ఆలస్యమైనా.. సగం పూట సెలవు పెట్టి మరీపాఠాలు బోధించి వెళ్తారట. పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం అతను అందించే ఆర్థిక సహకారాలు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం అందరినీ ఆకట్టుకుంటుంది. ఒక్కో సందర్భంలో పాఠశాల అభివృద్ధి కోసం తన సొంత డబ్బును ఖర్చుచేయడమే కాకుండా గ్రామస్థులు, నాయకులతో మాట్లాడి నిధులు సేకరించారు. ఇక పర్యావరణ హితం కోసం కృషి చేయడంతో పాటు.. తోటి ఉపాధ్యాయులను కూడా ఆ దిశగా నడిపిస్తున్నారు. తాను పనిచేసిన పాఠశాలల్లో పచ్చదనం, పరిశుభ్రత కోసం పలు కార్యక్రమాలు చేపట్టారు.

అందుకున్న అవార్డులు..

మడత శ్రీనివాస్ అందించిన సేవలకు గాను విద్యాశాఖ గుర్తించి అనేక అవార్డులు అందించింది. ఇందులో ప్రధానంగా 2001 సంవత్సరంలో నర్సంపేట డివిజన్ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడును అవార్డును ప్రతిభా సేవా సంస్థ ఆధ్వర్యంలో అందుకున్నారు. 2011 సెప్టెంబరు 5న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా కలెక్టర్ అవార్డు అందజేశారు. 2012లో పర్వతగిరి మండలంలో బెస్ట్ హెచ్‌ఎంగా మారీ స్వచ్ఛంద సంస్థ అవార్డు ప్రదానం చేసింది. అలాగే 2019 సెప్టెంబరులో మరోసారి జిల్లా స్థాయి అవార్డు అందుకున్న శ్రీనివాస్ 2022లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల స్థాయిలో ఎంఈవో నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. 2023 సెప్టెంబరులో కలెక్టర్ నుంచి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నారు.



శ్రీనివాస్ (ఫైల్)



2023లో కలెక్టర్ నుంచి అవార్డును అందుకుంటున్న శ్రీనివాస్ (ఫైల్)



ప్రస్తుతం శ్రీనివాస్ విధులు నిర్వర్తిస్తున్న బూర్గుమల్ల పాఠశాల



ఎంపీడీవో కార్యాలయంలో సమ్మె నోటీసును అందజేస్తున్న పంచాయతీ సిబ్బంది

పంచాయతీ సిబ్బంది సమ్మెనోటీసు

ఇనుగుర్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ సిబ్బంది డిమాండ్లను నెరవేర్చాలని, లేని పక్షంలో ఈనెల 19 తర్వాత ఏ రోజైనా సమ్మెకు వెళ్లనున్నట్లు సూచిస్తూ మంగళవారం ఇనుగుర్తి ఎంపీడీవో కార్యాలయంలో తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ పంచాయతీ సిబ్బందికి బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని, గ్రీన్‌ఛానల్ ద్వారా ప్రతీనెల 1వ తేదీన వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు బోళ్ల రాములు, ప్రసాద్, యాకలక్ష్మి, ఎల్లయ్య, భిక్షం, యాకమ్మ, టి.సుగుణ, సోమక్క పాల్గొన్నారు.

పదహారేళ్ల బాలిక కడుపులో 6 కిలోల కణితి

● శస్త్రచికిత్సద్వారా తొలగించిన వైద్యులు



ఆరు కిలోల కణితిని చూపిస్తున్న వైద్యుడు అర్జున్‌రెడ్డి

మహబూబాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : గార్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక కడుపులో సుమారు ఏడాదిగా పెరుగుతూ.. వచ్చిన ఆరు కిలోల బరువైన కణితిని మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ నర్సింగ్‌హోంలో వైద్యులు శస్త్రచికిత్స చేసి తొలగించారు. ఇటీవలే పదో తరగతి పరీక్షలు రాసిన సదరు బాలికకు ఎలాంటి బాధ కలుగకుండానే ఆరు కిలోల కణితిని సుమారు ఏడాదిపాటు కడుపులో మోసింది. మంగళవారం తెల్లవారుజామున కడుపులో నొప్పిగా ఉందంటూ తల్లిదండ్రులకు తెలపడంతో మహబూబాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. స్కానింగ్ ద్వారా కణితిని గుర్తించిన వైద్యుడు ఎం.అర్జున్‌రెడ్డి సుమారు రెండున్నర గంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించి తొలగించారు. ఇలాంటి జన్యుసంబంధిత అంశాలు అరుదుగా చోటు చేసుకుంటాయని బాధితులకు తెలియకుండానే అవి పెరుగుతూ.. వస్తాయని వైద్యుడు చెప్పారు.

దీప్తి జివాంజికి ఘన సన్మానం

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : అర్జున అవార్డు గ్రహీత, పారా ఒలంపిక్స్-2024 స్వర్ణపతక విజేత దీప్తి జివాంజిని ఘనంగా సన్మానించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో మంగళవారం కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారిణి దీప్తి జివాంజిని శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ గౌరవ సలహాదారుడు మైన శ్రీనివాస్ మాట్లాడుతూ దిగువ మధ్యతరగతి కుటుంబం నుంచిఎన్నో అవమానాలు ఎదురైనప్పటికీ తన లక్ష్యమే గీటురాయిగా ఎంచుకొని పారా ఒలంపిక్స్‌లో స్వర్ణపతకం సాధించి దేశప్రతిష్ఠను పెంచారని తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో దీప్తి జివాంజిని సన్మానించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నామిరెడ్డి వెంకట్‌రెడ్డి, పట్టాబి లక్ష్మయ్య, విష్ణువర్ధన్, మైన నాగయ్య, నాగేశ్వర్‌రావు, మధుసూదన్‌రెడ్డి, రాంబాబు, వెంకటేశ్వర్లు, శ్యామ్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, రవీందర్, వెంకన్న, ఉపేందర్, ప్రభాకర్, దేవ్‌సింగ్ పాల్గొన్నారు.

నష్టపోయిన పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి

కేసముద్రం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : నారాయణపురంలో సోమవారం రాత్రి కురిసిన వడగళ్ల వానతో నష్టపోయిన పంటలను మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల పరిశీలించారు. వరితోపాటు మిర్చి, మామిడి పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల తెలిపారు. సహాయ వ్యవసాయ సంచాలకుడు శ్రీనివాసరావు, ఎంఏవో బి.వెంకన్న ఉన్నారు.

అర్చక సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా కృష్ణమాచార్యులు

ఇనుగుర్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లా ధూప దీప నైవేద్య అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా ఇనుగుర్తికి చెందిన తిరునగరి కృష్ణమాచార్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ములుగు జిల్లా కేంద్రంలో మంగళవారం 600 మంది అర్చకులతో నిర్వహించిన ఉమ్మడి జిల్లా కమిటీ ఎన్నికల్లో ఆయనకు ప్రధాన కార్యదర్శి బాధ్యతలను రాష్ట్ర కమిటీ అప్పగించింది. ఆయన నియామకంపై పలువురు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

సోమ్లతండాలో చోరీ

డోర్నకల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని సోమ్లతండాలో ఓ ఇంట్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమ్లతండాకు చెందిన వాంకుడోతు వీరన్న-బుజ్జి దంపతులు వారం రోజుల క్రితం కొత్తగూడెంలోని తమ కుమారుడు ఇంటికి వెళ్లారు. సోమవారం సాయంత్రం బుజ్జి ఇంటికి వచ్చారు. ఇంటితాళం తీసి ఉండడంతో అనుమానం వచ్చిన బుజ్జి లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండడం గమనించి వెంటనే స్థానికులకు తెలిపింది. బీరువాలో ఉన్న తులంన్నర బంగారు ఆభరణాలతో పాటు రూ.20 వేలు నగదును అపహరించుకుపోయినట్లు తెలిపారు. ఈ విషయమై బాధితురాలు బుజ్జి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఒకరికి రిమాండ్..

మోదుగుగడ్డతండాకు చెందిన దారావత్ చంటిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డోర్నకల్ సీఐ రాజేష్ మంగళవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. తండాకు చెందిన దారావత్ పార్వతిని చంటి లైంగికంగా వేధించడంతో ఆమె మనస్తాపం చెంది ఈనెల 2న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. చికిత్స పొందుతూ ఈనెల 4న ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. పార్వతి చికిత్స పొందుతున్న సమయంలోనే ఆమె నుంచి ఫిర్యాదు తీసుకున్న పోలీసులు చంటిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

కురవి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని ఆ పార్టీమండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం అన్నారు. జైబాపు.. జైభీమ్.. జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కురవి మండలంలోని బంగారిగూడెం, బంచరాయితండా, స్టేషన్ గుండ్రాతిమడుగు, పొలంపల్లి తండా, హరిదాస్‌తండా, రాజోలు గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు.

శభాష్ పోలీసన్న

● విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో అధికారులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఫ్రెండ్లీ పోలీసింగ్‌నే కాదు.. ప్రజలు ఇబ్బందులు.. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కూడా కాపాడేవారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే తీవ్ర ఇబ్బందులను తొలగించే క్రమంలో జిల్లా పోలీసులు ముందంజలో ఉన్నారని ఇప్పటికే రుజువైంది. కేసముద్రంలో గత కొద్దినెలల క్రితం భారీ వరదలు వచ్చి రైల్వే ముప్పుకు గురైన సమయంలో ప్రజలు, ప్రయాణికులను ఆదుకున్న సంఘటన తెలిసిందే. సోమవారం రాత్రి అకస్మాత్తుగా బలమైన పెనుగాలులు వీయడంతో మహబూబాబాద్ నుంచి కేసముద్రం వరకు వయా పెనుగొండ రోడ్డు మార్గంలో, మహబూబాబాద్ నుంచి వయా కల్వల మీదుగా కేసముద్రం, నెల్లికుదురు, ఆలేరు మార్గంలోనూ భారీ సంఖ్యలో చెట్లు విరిగి రోడ్డుపైపడ్డాయి. కనీసం ద్విచక్రవాహనం కూడ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించడంతో మహబూబాబాద్ నుంచి ఈదులపూసపల్లి, గుర్రాలగుట్ట వరకు మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపిక తన సిబ్బందితో రాత్రి 9 గంటల సమయంలో జేసీబీ యంత్రాలతో చెట్లను తొలగించారు. కేసముద్రంనుంచి పెనుగొండ వరకు సుమారు 12 కిలోమీటర్ల చెట్లు కూలిపోవడంతో కేసముద్రం ఎస్సై మురళీధర్‌రాజు తన సిబ్బందితో వెళ్లి కష్టపడి చెట్లను తొలగించారు. కల్వల రోడ్డుకు కూడ కేసముద్రం పోలీసులు వెళ్లి జేసీబీల సాయంతో చెట్లను తొలగించారు. నెల్లికుదురు ఎస్సై రమేష్‌బాబు తన సిబ్బందితో ఆలేరు నుంచి నెల్లికుదురులో కూలిన చెట్లను తొలగించారు. పోలీసులు త్వరితగతిన స్పందించకుంటే రాత్రంతా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి ఉండేది. పోలీసులకు ప్రజలు హ్యాట్సాఫ్ చెప్పారు. కాగా, మహబూబాబాద్ డీఈ విజయ్‌కుమార్, ఎస్ఈ నరేష్ ఆదేశాలతో పలు మండల కేంద్రాల్లో విద్యుత్ రాత్రి సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు సిబ్బంది రాత్రి 11 గంటల వరకు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను అందించారు.



గుర్రాలగుట్ట వద్ద రోడ్డుపై పడిన చెట్లను జేసీబీ ద్వారా తొలగిస్తున్న ఎస్సై దీపిక



కేసముద్రం-పెనుగొండ మధ్య కూలిన వృక్షాలను తొలగిస్తున్న కేసముద్రం ఎస్సై మురళీధర్‌రాజు

హుస్సేన్‌నాయక్‌ను కలిసిన ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

నెహ్రూ సెంటర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలో పరిష్కారానికి నోచుకోక పెండింగ్‌లో ఉన్న గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్‌ను ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు మంగళవారం ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్‌నాయక్ మాట్లాడారు. మానుకోట మునిసిపాలిటీ పరిధిలోని వీరారం తండాకు చెందిన 10వ వార్డు మాజీ కౌన్సిలర్ భూక్య శ్రీనునాయక్ వారసత్వంలో వచ్చి న భూమి అన్యాక్రాంతమై బహుళ అంతస్థులు నిర్మిస్తున్నారని వివరించారు. ఈ విషయంపై రెవెన్యూ, మునిసిపల్‌శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. తమ భూమి కోల్పోయి అన్యాయానికి గురైన బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై హుస్సేన్‌నాయక్ కలెక్టర్‌తో విచారణ చేయిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కలిసిన వారిలో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులతో పాటు మాజీ కౌన్సిలర్ భూక్య శ్రీనివాస్‌నాయక్ ఉన్నారు.

ముందంజలో ఉంచాలి

● డీఎంహెచ్‌వో రవిరాథోడ్

నెహ్రూసెంటర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హెల్త్ విజన్ ఆధ్వర్యంలో చేపట్టే జాతీయ కార్యక్రమాలను జిల్లాను ముందంజలో ఉంచాలని జిల్లా వైద్యాధికారి రవిరాథోడ్ అన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలోమంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ కార్యక్రమాల వివరాలను బడ్జెట్ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సుధీర్‌రెడ్డి, సారంగం, లక్ష్మీనారాయణ, నీలోహణ, రామకృష్ణ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు గాయాలు

నెల్లికుదురు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మోడల్ స్కూల్ విద్యార్థులను తరలిస్తున్న ఆటో బోల్తాపడి ముగ్గురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం. మోడల్ స్కూల్ విద్యార్థులు 14 మందిని నెల్లికుదురు మోడల్‌స్కూల్ నుంచి ఎర్రబెల్లిగూడెం ప్రతీరోజు తరలిస్తుంటారు. మంగళవారం పాఠశాల నుంచి విద్యార్థులను తరలిస్తున్న క్రమంలో కాచికల్ స్టేజీ సమీపంలో ఆటో టైరు పంక్చర్ కావడంతో బోల్తా పడింది. దీంతో విద్యార్థులైన సముద్రాల వర్షిత్, యాటకానికి వర్షిత్, సాయిచరణ్‌లకు గాయాలు కావడంతో తొర్రూరు, ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మిగతా విద్యార్థులు క్షేమంగా ఉన్నారు.



గుంజేడు ముసలమ్మ ఆలయం ముందు కూలిపోయిన షెడ్డు



అమర్‌సింగ్‌తండాలో నేలరాలిన మామిడి



హనుమాన్‌నగర్‌తండాలో నేలవాలిన వరి

చెడగొట్టు వాన

(5వ పేజీ తరువాయి)

ఇబ్బందులు పడ్డారు. దీంతో భారీ నష్టం వాటిల్లింది. పెద్దమొరితండాలో ఇంటిరేకుల పైకప్పుపై రాళ్ల పెట్టడంతో వచ్చిన గాలిదుమారానికి రాళ్ల లేచి ఒక్కసారిగా తేజావత్ రాములుపై పడడంతో కాలు విరిగింది. అనేక విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. నెల్లికుదురు మండలంలోని 36 గ్రామపంచాయతీల పరిధిలో తీవ్రంగా బలమైన గాలులు వీచాయి. కోతకు వచ్చిన వరి, మొక్కజొన్న కంకులు నేలమట్టం అయ్యాయి. నెల్లికుదురు, బ్రాహ్మణకొత్తపల్లి, పార్వతమ్మగూడెం, రాజులకొత్తపల్లి, మునిగలవీడు, ఆలేరులలో మామిడితోటల్లో కాయలు రాలిపోయాయి. కొన్ని గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి.

తొర్రూరు మండలంలో వరి, మొక్కజొన్న, మామిడి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. హరిపిరాల, అమర్‌సింగ్‌తండా, పత్తేపురం, వెలికట్టే, మడిపెల్లిలలో కోత దశలో ఉన్న నేలమట్టం అయింది. మడిపెల్లి, చీకటాయపాలెంలో ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి. హరిపిరాలతో పాటు పలు గ్రామాల్లో మామిడితోటల్లో కాయలు రాలిపోయాయి. చిన్నగూడూరులో కూడా గాలిదుమారంతో ఉగ్గంపల్లి, చిన్నగూడూరు, జయ్యారంలలో తోటల్లో మామిడి కాయలు నేలరాలగా.. అనేక వరి చేళ్ల నేలవాలాయి. వడ్లు రాలిపోయి నష్టం వాటిల్లింది. పలు చోట్ల భారీ వృక్షాలు కూలిపోయాయి. కురవి మండలంలో అనేక ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి. లచ్చిరాంతండాలో ఇస్లావత్ కౌసల్య, నల్లెల్లో ఉప్పలయ్య ఇండ్లపైకప్పులు లేచిపోయాయి. వరి, మొక్కజొన్న పొలాలు నేలవాలాయి. పలుతోటల్లోని మామిడి, బొప్పాయి కాయలు నేలరాలాయి. 55 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు ఏవో నర్సింహారావు తెలిపారు.

బయ్యారం మండలంలో బయ్యారం, చర్లపల్లి, వెంగంపల్లి, కోటగడ్డ, బాలాజీపేటల్లోని తోటల్లో మామిడికాయలు రాలిపోవడంతో తోట లీజుదారులు ఆర్థికంగా దెబ్బతిన్నారు. మరిపెడలోని ఎల్లారిగూడెం, బీచరాజుపల్లి, పురుషోత్తమయగూడెం, ఎడ్జెర్ల, బాల్ని ధర్మారం, తానంచెర్ల, రాంపురంలలోని మామిడితోటల్లో కాయలు రాలిపోయాయి. మండలంలో రెండు నిమిషాలే గాలిదుమారం వచ్చింది. డోర్నకల్, సీరోలు మండలాల్లో కూడా రెండు నిమిషాలపాటే గాలిదుమారం వచ్చిపోయింది. ఎలాంటి నష్టం వాటిల్లలేదు. గూడూరు మండలంలోని దామరవంచ శివారు లక్మీతండాలో భూక్య శ్రీను ఇంటికప్పు లేచిపోయింది. మండలంలో గాలిదుమారం ఉధృతంగా వచ్చినప్పటికి ఎలాంటి పంట నష్టం జరుగలేదు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

కొత్తగూడలో ఉధృతంగా గాలిదుమారం వీచింది.. గుంజేడు ముసలమ్మ దేవాలయం ముందు ఉన్న రేకులషెడ్డు లేచి గుడి ముందు పడ్డాయి. గాంధీనగర్, మిగతా గ్రామాల్లోని తోటల్లో మామిడి కాయలురాలిపోయాయి. కొన్నిచోట్ల మొక్కజొన్న నేలవాలింది. గార్ల శివార్లలో గాలిదుమారానికి తాటిచెట్లు విరిగి కరెంట్ స్తంభాలపై పడడంతో స్తంభాలు విరిగిపోయాయి. విద్యుత్ సరఫరా బంద్ కావడంతో ప్రజలు పలు ఇబ్బందులు పడ్డారు. నర్సింహులపేటలో గాలిదుమారం ఉధృతంగా వీచింది. అన్ని గ్రామాల్లో వరి నేలవాలింది. చేతికి వచ్చిన వరిగింజలు రాలిపోయాయి. నర్సింహులపేట, బొజ్జన్నపేట, కొమ్ములవంచ, పెద్దనాగారంలలో మామిడి తోటలు కాయలు రాలాయి. పలు ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి. కాగా, నష్టపోయిన పంటలకు సర్వే చేసి పరిహారం ప్రభుత్వం అందించాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్యాంసుందర్‌శర్మ

బీజేపీతోనే సమగ్రాభివృద్ధి

డోర్నకల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ పార్టీతోనే గ్రామాలు, పట్టణాలు సమగ్రాభివృద్ధి చెందుతాయని రాష్ట్ర కౌన్సిల్‌సభ్యులు శ్యాంసుందర్‌శర్మ అన్నారు. మంగళవారం డోర్నకల్‌లో పార్టీ కార్యకర్తలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గావ్.. చలో.. బస్తీచలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. గ్రామాలలో మంచినీరు, రోడ్లు, పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థ మొదలగు సమస్యలతో పాటు పట్టణాలలో మౌళిక వసతులు ఏర్పాటు చేయడానికి అవకాశంఉంటుందన్నారు. సమావేశంలో దేవాసింగ్, గణేష్‌నాయక్, లకన్‌వ్యాస్, రెహమాన్, నాగేష్, బాలునాయక్, శ్రీకాంత్, కల్యాణ్, హన్మంతు, లాల్‌సింగ్, బిందుకుమార్, రవి, అశోక్,సుమన్, హట్యా, విజయ్ పాల్గొన్నారు.

అన్ని మతాల సారం ఒక్కటే

● ఎమ్మెల్సీ రవీందర్‌రావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : అన్ని మతాల సారం ఒక్కటేనని, మతాల మధ్య ధర్మాన్ని పెంపొందించేందుకు ఈద్‌మిలాన్ దోహదపడతుందని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. మహబూబాబాద్‌లోని రామాస్ స్కూల్‌లో జమాతే ఇస్లామిహింద్ మానుకోట శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఈద్‌మిలాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ రవీందర్‌రావు మాట్లాడారు. జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ఖలీద్ ముబషీర్, వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ మజీద్ షోయబ్, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్, పట్టణ అధ్యక్షుడు ఎక్బాల్, మాజీ మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, డాక్టర్ నెహ్రూరాథోడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

సామాన్యుల నడ్డి విరిచిన మోదీ సర్కార్



సీపీఎం ఆధ్వర్యంలో ఖాళీ సిలిండర్లతో ఆందోళన చేస్తున్న కార్యకర్తలు

గార్ల ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం వంటగ్యాస్ ధరలు పెంచి, పేద ప్రజల నడ్డి విరిసిందని సీపీఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి అన్నారు. సీపీఎం మండల కమిటీతో పాటు పాటు సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో వేరువేరుగా మంగళవారం స్థానిక నెహ్రూసెంటర్‌లో ఖాళీ సిలిండర్లతో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోదీ ప్రభుత్వంలో పేదలకు ఇబ్బందులకు గురిచేసే విధంగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజలను మరోసారి మోసం చేయడం జరిగుతుందన్నారు. సీపీఐ నాయకులు కట్టెబోయిన శ్రీనివాస్, జంపాల వెంకన్న, దూపాటి జనార్ధన్, ధరవత్ వీరన్న, సీపీఎం నాయకులు కందునూరి శ్రీనివాస్, వంగూరి వెకటేశ్వర్లు, అంబటి వీరస్వామి, రమాదేవి, సజాత, ఉమాదేవి, రామకృష్ణ, కోటయ్య, మౌలానా పాల్గొన్నారు.

గ్యాస్ ధరలను తగ్గించాలి

కురవి, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం ఒకేసారి రూ.50 పెంచిన వంటగ్యాస్ సిలిండర్ ధరను వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కురవిలో మంగళవారం జరిగిన ఆ పార్టీ సమావేశంలో ఆయనమాట్లాడుతూ గ్యాస్ ధర పెంచడంతో రాష్ట్రంలో 91 లక్షల కుటుంబాలపై, పరోక్షంగా మరో 11 లక్షల ఉజ్వల లబ్దిదారులపై ఆర్థికభారం పడుతుందన్నారు. తక్షణమే కేంద్రం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి కర్నం రాజన్న, కన్నె వెంకన్న, ఎన్.నాగేశ్వర్‌రావు, బొల్లం ఉప్పలయ్య పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన కల్పిస్తాం : కాంగ్రెస్

చిన్నగూడూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే కాంగ్రెస్ లక్ష్యమని డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్ అన్నారు. మంగళవారం గుండంరాజుపల్లి, పగిడిపల్లిలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విచ్ఛిన్నానికి కుట్రలు చేస్తోందని ఆరోపించారు. నాయకులు రాంరెడ్డి, మురళిధర్‌రెడ్డి, భిక్షపతి, రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

20 నుంచి గంగభవాని జాతర షురూ

మరిపెడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : తానంచర్లలోని గంగభవాని జాతరను ఈనెల 20, 21, 22 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు రామసహాయం సత్యనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం తానంచర్లలో ఆయన మాట్లాడుతూ భక్తులు జాతరకు అధికసంఖ్యలో పాల్గొనలన్నారు. రామసహాయం ఆనంద్‌రెడ్డి, అజిత్‌రెడ్డి, వాసంశెట్టి రమేష్, నరేష్‌రెడ్డి, ముకేశ్, రామన్న, శ్రావణ్‌రెడ్డి, రామన్న, సోమన్న, వీరరెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మరిపెడ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): చిల్లం చర్లలో జనవికాస ఆధ్వర్యంలో గాదె అశోక్‌రెడ్డి సహకారంతో చలివేంద్రాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ జనవికాస సేవలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ ఉమేష్, లక్ష్మీనర్సు, కృష్ణ, భిక్షం, వెంకన్న, మహేష్, రాంరెడ్డి, శ్రీలక్ష్మి, పద్మ, ఉమా, స్వప్న, సుకన్య, స్వర్ణలత పాల్గొన్నారు.

యువత భాగస్వామ్యం కావాలి

పెద్దవంగర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవలో యువత భాగస్వామ్యం కావాలని మాజీ సర్పంచ్ పాకనాటి రామకృష్ణారెడ్డి, జన వికాస కో-ఆర్డినేటర్ రమ అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నవంగరలో బొమ్మెర స్వప్న నాగేష్ దంపతుల సహకారంతో జన వికాస ఆధ్వర్యంలో గ్రామ పంచాయితీ ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనాథ్‌రెడ్డి, జన వికాస ప్రతినిధులు సరిత, నాగమ్మ, నీలవేణి, విజయ పాల్గొన్నారు.

నేల స్వభావాన్నిరైతులే కాపాడుకోవాలి

పెద్దవంగర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నేల స్వభావాన్ని కాపాడుకోవాల్సి బాధ్యత రైతులదేనని మండల వ్యవసాయాధికారి గుగులోతు స్వామినాయక్ అన్నారు. మంగళవారం ఉప్పరగూడెంలో రైతుల సమావేశం ఏర్పాటు చేసి మానవాళి మృత్తికలకు సంబంధం, జీవన ఎరువుల యొక్క ప్రాముఖ్యతలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు యశస్విని, రాజు, విశ్వశాంతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు డిపో అభివృద్ధికి పాటు పడాలి : డీఎం

తొర్రూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ఆర్టీసీ డిపో అభివృద్ధికి అన్ని విధాల పాటుపడాలని తొర్రూరు ఆర్టీసీ డిపో మేనేజర్ పద్మావతి అన్నారు. మంగళవారం వరంగల్ రీజియన్ పరిధిలో ప్రగతిచక్రం త్రైమాసిక పురస్కారాల్లో భాగంగా అత్యధిక ఆదాయం కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్, కండక్టర్‌లకు ఆర్ఎం కార్యాలయంలో ఎంపిక చేసిన అవార్డులు అందజేయడం జరిగిందని తెలిపారు. రీజియన్ పరిధిలోని 9 డిపోల్లో తొర్రూరు డిపోలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు కండక్టర్లు, నలుగురు ఆర్టీసీ అద్దెబస్సు డ్రైవర్‌లు అవార్డులకు ఎంపికయ్యారని తెలిపారు. ఆర్ఎం ఉదయభాను చేతులమీదుగా అవార్డులు అందించడం జరిగిందన్నారు. ఎస్టీఐ రజిత, ఎంఎఫ్ కుమార్, అధికారులు, ఉద్యోగులు ఉన్నారు.

శ్రవణ్‌కు ఉత్తమ అవార్డు

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ (ఆర్టీసీ)లో వెల్డర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్.శ్రవణ్ ఉత్తమ వెల్డర్ అవార్డును అందుకున్నారు. టీజీ ఎస్ఆర్టీసీ వరంగల్ రీజియన్ ప్రగతి చక్ర త్రైమాసిక అవార్డులను మంగళవారం ప్రధానం చేశారు. మానుకోట ఆర్టీసీ డిపోలో వెల్డర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రవణ్ వరంగల్ రీజినల్ మేనేజరు విజయబాను చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం, డిపో మేనేజరు ఎం. శివప్రసాద్, సిబ్బంది శ్రీనివాస్, పాపిరెడ్డి, వెంకన్న, నర్సయ్య పాల్గొన్నారు.



ఉత్తమ వెల్డర్‌గా అవార్డు అందుకుంటున్న శ్రవణ్

కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే రైతుల కోసం సంక్షేమ పథకాలు

● మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

డోర్నకల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్ల పాటు రైతు సంక్షేమ కోసం మాజీ సీఎంకేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలుప్రవేశపెట్టారని డోర్నకల్ మాజీఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని గొల్లచర్లలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో విఫలమైందని ఆరోపించారు. రైతులుపండించిన పంటలకు గిట్టుబాటు ధర రావడం లేదని, వ్యవసాయానికి సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మహబూబాబాద్ ఏఎంసీ మాజీ చైర్మన్ విద్యాసాగర్, ధరంసోత్ బాలు, నంజాల మధుసూదన్, రాయల వెంకటేశ్వర్లు, వరలక్ష్మి, పాండునాయక్, తేజావత్ రమేష్, పోటు జనార్ధన్, శరత్‌బాబు, బీఆర్ఎస్ కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

